
క్లుప్తంగా

కాలువ తవ్వకంపై అభ్యంతరాలు

భామిని: మండలంలోని సతివాడ వద్ద గల బైరాగినాయుడు చెరువుకు కొండవాగు గెడ్డనీరు వచ్చేందుకు కాలువ తవ్వుతుండగా స్థానిక రైతులు గురువారం అడ్డుకున్నారు. సుమారు 150 ఎకరాల ఆయకట్టు గల బైరాగినాయుడు చెరువుకు నామమాత్రంగా నీరు వచ్చేందుకు కూడా కాలువ పనికి రాదని రైతులు ఆరోపిస్తున్నారు. కొండవాగు గెడ్డ బట్టి విస్తీర్ణం 160 లింకులున్నట్లు మ్యాప్‌లో చూపిస్తుండగా.. 60 లింకుల వెడల్పులో జేసీబీ తవ్వడాన్ని తప్పుబట్టారు. కాలువ ఆక్రమణకు గురికావడంతో బీజేపీ నాయకుడు మండల రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మండల తిరుపతిరావు ఆయకట్టు రైతులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భామిని రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించి కాలువ తవ్వుతుండగా... రాజకీయ నాయకుల ఒత్తిడితో అధికారులు కాలువ వెడల్పు తగ్గించారని రైతులు మండిపడ్డారు. 160 లింకుల వెడల్పుతో కాలువ తవ్వాలని రైతులు డిమాండ్ చేశారు.

జోరుగా పశువుల అక్రమ రవాణా



వ్యాన్‌లో పశువులను తరలిస్తున్న దృశ్యం

భామిని: మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు పాడి పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. బుధవారం రాత్రి పలు వాహనాల్లో పశువులను నిబంధనలకు విరుద్ధంగా ఎక్కించుకుని తరలించారు. ఒడిశా గ్రామాల నుంచి ఏబీ రోడ్డు మీదుగా పశువులను కాలి నడకన తీసుకువచ్చి, ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పశువుల రవాణాపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం



గొట్ట మంగళాపురం విద్యార్థులకు సూచనలు చేస్తున్న డాక్టర్ కమల్‌నాథ్

పాలకొండ రూరల్: రోగాలను అధిగమించేందుకు వ్యక్తిగత పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కమల్‌నాథ్ అన్నారు. మండలంలోని గొట్ట మంగళాపురంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాకాలంలో డయేరియా, మలేరియా, డెంగీ, తదితర ప్రాణాంతక జ్వరాలు, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం, వేడి ఆహారపదార్థాలు, కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలి



కొమరాడ రజకవీధిలో కుళాయి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కొమరాడ: మండల కేంద్రమైన కొమరాడలో ఇన్‌చార్జ్ కార్యదర్శిని తొలగించి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కొమరాడ రజకవీధి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు కూడా సక్రమంగా జరగడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి రెగ్యులర్ కార్యదర్శిని నియమించడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

బాలికా విద్యపై ప్రచారం



మానవహారంగా ఏర్పడిన అధికారులు, విద్యార్థులు

భామిని: నీతి అయోగ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా బాలికా విద్యపై గురువారం ప్రచారం చేపట్టారు. మండల కేంద్రంలో విద్యార్థులతో సంపూర్ణత ర్యాలీ నిర్వహించి నినాదాలు చేయించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం కూడలిలో మానవహారంగా ఏర్పడి బాలికా విద్యపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్, ఎంఈఓ వి.భాస్కరావు, ఏస్పిరేషన్ బ్లాక్ కోఆర్డినేటర్ మహేశ్వరరావు, ఎమ్మార్సీ సీఓ రామకృష్ణ, సీఆర్‌పీలు, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాలకొండ: అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ వెంకటరమణ



పాలకొండ: అల్లూరి జయంతి సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ, అధికారులు



జియ్యమ్మవలస: ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు, తదితరులు

మన్యం వీరుడికి జోహార్లు..

మన్యం ప్రజల స్వేచ్ఛ కోసం ఆయుధం పట్టి బ్రిటీష్ దొరల గుండెలను గడగడలాడించి, తెలుగు జాతిని జాగృతం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు.. తన పోరాట పటిమతో అడవి నుంచి ఆకాశమంత ఎత్తుకు ఎదిగి ప్రజల కోసం నేలకొరిగిన ధీశాలి మన అల్లూరి. సాయుధ పోరాట యోధుడు, విప్లవ వీరుడి తెగువ యువత ఆదర్శం . అటువంటి మహానుభావుడి జయంతి వాడవాడలా గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి జోహార్ అల్లూరి అంటూ నినదించారు.

– పాలకొండ/ కురుపాం నెట్‌వర్క్



సీతంపేట: అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గరుగుబిల్లి : ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈఓపీఆర్‌డీ గోపాలరావు, తదితరులు



గరుగుబిల్లి : శాఖా గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిర్వాహకులు మధుసూదనరావు, తదితరులు



పాలకొండ రూరల్: అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జూనియర్ కళాశాల సిబ్బంది



వీరఘట్టం: విప్లవవీరుడు అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ జయప్రకాష్, రెవెన్యూ సిబ్బంది



కొమరాడ: అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది



గుమ్మలక్ష్మీపురం: అల్లూరి ధైర్యసాహసాలను విద్యార్థులకు వివరిస్తున్న డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామయ్య

రూ. 400 వేతనం ఇవ్వాలి..

గరుగుబిల్లి: ఉపాధి వేతనదారులకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించడంతో పాటు రోజుకు 400 రూపాయల వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు బీవీ రమణ, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఎ.రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పథకం ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని, అలాంటి ఈ పథకాన్ని బలహీనపరిచేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆరోపించారు. రెండు పూటలా ఉపాధి హామీ పనులు చేయించడం వల్ల సన్న, చిన్నకారు రైతులు కూలీలు దొరక్క ఇబ్బంది పడుతున్నారన్నారు.



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ధర్నా చేస్తున్న రైతు సంఘం, సీఐటీయూ నాయుకులు

అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయం ఈఓపీఆర్‌డీ గోపాలరావుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు నల్ల శంకరరావు, జాగాన అప్పలనాయుడు, జాగాన శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు అందించాలి

పాలకొండ రూరల్: ఉపాధి వేతనదారులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఏడాదిలో 200 రోజులు పని కల్పించడంతో పాటు రోజుకు 400 రూపాయల వేతనం గిట్టుబాటయ్యేలా పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాద రాము, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు త్రినాథ, ఎన్ని యశోదమ్మ, పి. అంకమ్మ, సరోజిని, రాములమ్మ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు

కురుపాం: ఈ నెల ఆరో తేదీన ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా యజమానులు తమ పెంపుడు కుక్కలకు యాంటీరేబిస్ టీకాలు వేయించుకోవాలని గుమ్మ పశువైద్య కేంద్రం వైద్యాధికారి కె.శైలజ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. జునోసిస్ వ్యాధులనేవి జంతువుల నుంచి మనుషులకు.. మనుషుల నుంచి జంతువులకు సంక్రమిస్తాయన్నారు. 6వ తేదీన గుమ్మ పశువైద్య కేంద్రంలో ఉచితంగా యాంటీరేబిస్ టీకాలు వేస్తామని తెలిపారు.

ఉచితంగా యాంటీరేబిస్ టీకాలు

గరుగుబిల్లి: ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా ఈ నెల ఆరో తేదీన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కుక్కలకు ఉచితంగా యాంటీరేబిస్ టీకాలు వేయనున్నట్లు పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, జునోసిస్ వ్యాధుల గురించి ప్రజలను అప్రమత్తం చేసి పెంపుడు జంతువులకు టీకాలు వేడయమే జునోసిస్ డే ముఖ్య ఉద్దేశమన్నారు.

ఎం.సింగుపురంలో గ్రామసభ

పాలకొండ రూరల్: ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని ఎం.సింగుపురం సర్పంచ్ రణస్థలం రమాదేవి అన్నారు. గురువారం స్థానిక సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించి, ప్రజా సమస్యలపై చర్చించారు. రోడ్లపై పశువులను కట్టడం, చెత్త వేయకుండా ప్రజలను చైతన్యపరచాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సింహాచలం, ఆశ, అంగన్‌వాడీ, క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు..

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరమని పంచాయతీ కార్యదర్శి టి.భాస్కరరావు అన్నారు. మండలంలోని గొట్టివలసలో సర్పంచ్ బోను చంద్రినాయుడు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, తదితర పనులకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలిన వెంటనే వైద్యశిబిరాలు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: గొట్టివలసలోని గ్రామసభలో మాట్లాడుతున్న కార్యదర్శి భాస్కరరావు



పాలకొండ రూరల్: గ్రామ సభలోమ పాల్గొన్న సర్పంచ్ రమాదేవి, తదితరులు

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎగువ తాడికొండ నుంచి చాపరాయి జంగిడిభద్ర గ్రామానికి గల 3.5 కిలోమీటర్ల రహదారిలో బీటీ రోడ్డు నిర్మాణానికి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం ఎగువ తాడికొండ గ్రామంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ప్రాంత గిరిజనులకు పక్కా రోడ్డు సదుపాయం కల్పించేందుకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 2.60 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. సకాలంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూ ఈఈ శాంతీశ్వరరావు, డీఈ సింహాచలం, ఏఈ అప్పారావులతో పాటు టీడీపీ నాయకులు పాడి సుదర్శనరావు, బిడ్డిక పద్మ, అడ్డాకుల నరేష్, తాడికొండ సర్పంచ్ మండంగి జగ్గారావు పాల్గొన్నారు.



బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

పెండింగ్ పనులు పూర్తి చేయండి

● తహసీల్దార్ జయప్రకాష్

వీరఘట్టం : కుల, ఆదాయ, ఓబీసీ, ఈబీసీ ధ్రువపత్రాల మంజూరుతో పాటు వీఆర్‌ఓలు, ఆర్‌ఐ లాగిన్‌లో ఉన్న పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని తహసీల్దార్ కె.జయప్రకాష్ సూచించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ముటేషన్లు, నాలా ఫైల్స్ అన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లీకేజీ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

కురుపాం : నీట్ పేపర్ లీకేజీ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వెంటనే బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు, స్థానిక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు .

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖాధికారి ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఉల్లిభద్రలో గురువారం వైద్యశిబిరం నిర్వహించి, పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు ముద్ద చర్మవ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ఈ వ్యాధి ప్రబలితో జ్వరం రావడంతో పాటు కళ్ల నుంచి నీరు కారడం, సొంగ కార్చడం, కాలు వాపు, చర్మంపై గుండ్రంగా మచ్చలేర్పడతాయన్నారు. రైతులు ఈ వ్యాధిపై అవగాహన ఏర్పరచుకుని పశువులకు టీకాలు వేయాలని సూచించారు. ఆర్‌బీకే పశువైద్యసిబ్బంది ఎన్. శశికళ, తదితరులున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



గుమ్మలక్ష్మీపురం: ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కురుపాం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ శంకరరావు, సిబ్బంది గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.రామగోవింద, వార్డెన్ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ బాలిలక ఆశ్రమ పాఠశాలలో...



కురుపాం: విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శంకరరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేడీ కాలనీలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.బుద్దేశ్వరరావు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరంతో బాధపడుతున్న 16 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ బుద్దేశ్వరరావు మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున విద్యార్థినులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.



చిన్నారులకు ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

భవిత కేంద్రాలతో సత్ఫలితాలు

వీరఘట్టం: మానసిక అస్థిత్వం గల పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఎంఈఓ ఆర్.ఆనందరావు అన్నారు. అగ్రహారంవీధి ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపిస్టు ఆర్.శ్రీకాంత్ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

పైనాపిల్ వ్యాన్ బోల్తా

సీతంపేట: కొండ శిఖర మారుమూల గ్రామమైన మీనకోట నుంచి విశాఖపట్నానికి పైనాపిల్ విక్రయించడానికి తీసుకువెళ్తుండగా జంపరకోట సమీపంలో వ్యాన్ బోల్తా పడింది. వ్యాన్ అదుపు తప్పి బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన పైనాపిల్ విక్రయానికి తీసుకువెళ్తుండగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల రుక్మిణిగూడ ఘాట్‌రోడ్‌లో కూడా ఒక వ్యాన్ బోల్తాపడిన విషయం విదితమే.



రోడ్డుపై పడిన పైనాపిల్ వ్యాన్